


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
బుధవారం 30 జులై 2025 8 పేజీలు




# స్పా ముసుగులో వ్యభిచారం

- జిల్లాలోని పలు మసాజ్ సెంటర్లలో చీకటి కార్యకలాపాలు
- నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్‌లు
- ఫోన్ చేస్తే లొకేషన్ పంపుతున్న వైనం
- మొద్దు నిద్రలో సంబంధిత అధికారులు..?

కొందరు వ్యక్తులు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కు తున్నారు.. ఆడవాళ్లను బలవంతంగా వ్యభిచార కూపంలోకి లాగి డబ్బులు దండుకుంటున్నారు.. ముఖ్యంగా పల్నాడు జిల్లా నరసరావుపేట, గుంటూరు నగర పరిధిలో చాలా చోట్ల ఇలాంటి అక్రమ వ్యాపారాలు విపరీతంగా కొనసాగుతున్నాయి.. అమాయకమైన అమ్మాయిలను తమ వలలో వేసుకుని వారిని తీసుకువచ్చి వ్యభిచార ముఠాలకు విక్రయించి అందినకాడికి డబ్బును దండుకుంటున్నారు.. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం మొద్దునిద్రలో ఉన్నారనే విమర్శలు లేకపోలేదు..

..3లో

## పొన్నూరులో ఆర్డిఎస్ఎస్ పనులు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆర్ డి ఎస్ ఎస్ పనుల పరిశీలనకై మంగళవారం ఉదయం పొన్నూరు నియోజకవర్గం పొన్నూరు మండలం నిడుబ్రోలు గ్రామం మార్కెట్ యార్డు ప్రక్కన గల 33/11 కె.వి సబ్ స్టేషన్ లో 58.2 లక్షల ఖర్చుతో చేపట్టిన ఫీడర్ మోడరైజేషన్ క్రింద చేపట్టిన పనులను ఏపిసిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి , పొన్నూరు శాసన సభ్యులు ధూళ్లిపాళ్ళ నరేంద్ర కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి పరిశీలించారు. 33/11 కెవి

మిగతా 3లో






## మిస్సింగ్ కేసు నమోదు



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలు తప్పిపోయినట్లు బందువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయినట్లు కొత్తపేట ఎస్ ఐ రమేష్ తెలిపారు. మార్కాపురంకు చెందిన సిహెచ్. పిచ్చమ్మ(70) సోమవారం సాయంత్రం గం.5. 30 ని.లకు హాస్పటల్ నుంచి టీ కొరకు బయటకు వచ్చి తిరిగి హాస్పిటల్ కి రాలేదని తెలిపారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసినవారు కొత్తపేట ఎస్ హెచ్ ఓ ఫోన్ నెంబర్. 8688831320, ఎస్పై 8688831609 నెంబర్లకు తెలియజేయగలరని తెలిపారు.

## గోవులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలి

**– పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు**



**మంగళగిరి –తాడేపల్లి :** నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం గోశాలలోని గోవులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గోశాల అస్తవ్యస్త నిర్వహణపై దినపత్రికల్లో కథనాలు ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాధవి తో కలసి గోశాలను సందర్శించారు. గోశాలలో గోవులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను నిర్వాహకులు సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యపరంగా గోవులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. అయితే గోశాలలో అధిక సంఖ్యలో ఉన్న గోవులకు సరియైన వసతి సదుపాయాలు లేకపోవడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రతగా ఉందన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు స్పందించి గోశాల ఆవరణలో పేరుకుపోయిన గోమూత్రం, పేడను తొలగించి శుభ్రం చేసినట్లుతెలిపారు. భవిష్యత్తులో గోశాలలో గోవులకు మెరుగైన వసతి సదుపాయాలను కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

# యర్రబాలెం గోశాలలో పరిశుభ్రతా చర్యలు

**– పరిశీలించిన నగర కమిషనర్ అలీంబాషా**

**– సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు**

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం పారిశ్రామిక వాడ శ్రీకృష్ణానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో గోవుల మూత్రం, పేడతో నిండిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు గోవులు సైతం కాలు తీసి కాలు వేయలేని దుర్భర పరిస్థితి నెలకొంది. తాజాగా గోశాలలో ఓ లేగ దూడ మృత్యువాత పడి రెండు రోజులైనా దాని కళేబరాన్ని తొలగించలేదు. దీంతో కొందరు స్థానికులు మృతి చెందిన లేగదూడ కళేబరాన్ని గుర్తించి వీడియో తీయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం విదితమే. దీంతో స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖాల మంత్రి నారా లోకేష్ లు గోశాల సమస్యపై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, నగర కమిషనర్ అలీంబాషా, తహసిల్దార్ దినేష్ రాఘువేంద్ర లు హుటాహుటీన యర్రబాలెం గోశాలకు చేరుకొని నిర్వాహకుడు సతీష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోశాలలో అపరిశుభ్రతపై జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ గోశాల నిర్వాహకుడు సతీష్ పై



ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డ్రోజర్, బాబ్ కార్డ్‌ల సహాయంతో గోశాలలోని గో మూత్రం, పేడలను తొలగించి శుభ్రం చేస్తోన్నారు. గోశాలలో జరుగుతున్న పనులను నగర కమిషనర్ అలీం బాషా, నగరపాలక సంస్థ ఏఈ ప్రవీణ్ లు పర్యవేక్షించారు. కాగా గోశాలలో గోవుల మృత్యువాత, అపరిశుభ్రత పై స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖాల మంత్రి నారా లోకేష్ తో పాటు సంబంధిత శాఖల అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీకమిషన్ చైర్మన్‌ను సన్మానించిన రావెల నల్లయ్య



**గుంటూరు, రూరల్ మేజర్, న్యూస్ :**

గుంటూరులోని ఏసీ కళాశాలలో ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ కి ఏర్పాటు చేసిన అభినందన సభలో మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు నక్క ఆనంద్ బాబు,మాజీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల మ్యాని,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడప మోహన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావెల నల్లయ్య ప్రత్యేకంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకం పట్ల హర్షం ప్రకటించారు. క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడప మోహన్ వివిధ ప్రజాసంఘాల కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. .

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండండి


**– సీఐ రామా నాయక్**



**వట్టిచెరుకూరు, మేజర్ న్యూస్:** డ్రగ్స్ వినియోగం వలన చాలా అనర్ధాలు ఉన్నాయని కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయని, సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని వట్టిచెరుకూరు సీఐ kఎస్ ) యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలోమారక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రామా నాయక్ మాట్లాడుతూ మారక ద్రవ్యల వినియోగించడం నేరమని, అలా వాడితే కటాకటాల పలావుతారని విద్యార్థులని హెచ్చరించారు. వాటి వినియోగం వలన కలుగే విశ్లేషణ త్మాకంగా వివరించారు. కళాశాలల్లో EAGLE క్లబ్ లేదా కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా సమర్థవంతంగా మారకద్రవ్యాలను నిరోధించవచ్చని కావాల్సిన వాతావరణం ఏర్పడుతుందని విద్యార్థులకు తెలియజేసారు. డ్రగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి హాజరైన వారందరూ డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని మరియు డ్రగ్స్ రహిత సమాజానికి రాయబారులుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ చైర్మన్ చందు రోహిత్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి వి ఎస్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె కిరణ్ కుమార్, వివిధ విభాగధిపతులు, ప్రొఫెసర్ లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరణ పథకం సద్వినియోగం చేసుకోండి

**తెనాలి, మేజర్ న్యూస్ :** అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంను పొడిగిస్తూ ప్రభుత్వం సవరణ చేసిన ఉత్తర్వులు విడుదల చేసినట్లు మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. మంగళవారం తన ఛాంబర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30 వ తేదీకి ముందుగా వేసిన అనధికారికంగా లేఅవుట్ల, ప్లాట్లకు అపరాధరుసుకు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. అపరాధ రుసుం 50 శాతం లేదా రూ. 10 వేలు తగ్గకుండా చెల్లించి 90 రోజుల్లోపు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చునని తెలిపారు. ఎల్ ఆర్ ఎస్ 2020 పథకంలో దరఖాస్తులు దఖలు చేసి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను అర్జీదారులు బ్యాలెన్స్ ఫీజు చెల్లించి



అవసరమగు డాక్యుమెంట్లు దాఖలు చేసి క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. 45 రోజుల్లోపు పూర్తిగా రుసుము చెల్లిస్తే 10 శాతం రాయితీ, 90 రోజుల్లోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ పొందవచ్చునని చెప్పారు. భూయజమానులు తమ ప్లాట్ల వివరాలతో పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అనధికారికంగా లేయౌట్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అక్టోబర్ 24 వ తీరు వరకు ఈ అవకాశం కల్పించిందని చెప్పారు. వివరాలకు తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించవచ్చునని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, ప్రజారోగ్య విభాగపు అధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, టీపీవో సాంబశివరావు ఉన్నారు.

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆదాని కంపెనీ లోపాల కోసం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లను ప్రజానీకం వ్యతిరేకించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు పెంచిన చార్జీలు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోక మరింత బాధడు మొదలు పెట్టారని విమర్శించారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని నాడు పిలుపునిచ్చిన సంఘటన ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ 9,000 నుండి రూ 18 వేల వరకు విద్యుత్ వినియోగదారుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్ల తర్వాత మరల విజయతరహాలో వసూళ్లు చేస్తారని హెచ్చరించారు. ప్రస్తుతం మనం కరెంటు వాడుకున్న తర్వాత బిల్లు చెల్లించే పద్ధతి అమల్లో ఉందని చెప్పారు. స్మార్ట్ మీటర్ బిగిస్తే ముందుగా డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాలెన్స్ అయిపోయిన తక్షణమే కరెంట్ సరఫరా దాని అంతట అదే ఆగిపోతుంది అని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ వస్తే రోజులు ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒక రేటు, సాయంత్రం ఒక రేటు చొప్పున అదనంగా వసూలు చేస్తారని చెప్పారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై పెద్ద ఎత్తు న విద్యుత్ భారాలు మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు కు వ్యతిరేకంగా ప్రజానీకం ఊరువాడ కదలాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ విద్యుత్ సబ్స్టేషన్ ముందు జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు పల్లె కృష్ణ, డి వి విజయభాస్కర్ రెడ్డి, నీరుడు దుర్గారావు, తుడిమెళ్ళ వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అరవింద బాబుకు బీసీ నాయకులు సన్మానం

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును స్థానిక బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు మరియు సమాజంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు బీసీ సంక్షేమం కోసం చేస్తున్న కృషిని, నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న నిబద్ధతను నాయకులు కొనియాడారు. ఆయన "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో జొన్నలగడ్డ, లింగంగుంట్ల వంటి గ్రామాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, కూటమి ప్రభుత్వ హామీలను అమలు చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపత్రుడు అధ్యక్షతన 2025–26 సంవత్సరానికి సంబంధించి శాసనసభ మరియు శాసనమండలి సంయుక్త కమిటీలలో డాక్టర్ చదలవాడ అరవింద బాబు బీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ నియామకం ఆయన సామాజిక న్యాయం మరియు బీసీ వర్గాల అభివృద్ధి కోసం చేస్తున్న సేవలకు గుర్తింపుగా భావించబడుతోంది. సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ, డాక్టర్ చదలవాడ అరవింద బాబు, "నరసరావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమం మరియు



బీసీ వర్గాల ఉన్నతి కోసం తన వంతు కృషి చేస్తానని" తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేదల భవిష్యత్తు కోసం, సామాజిక న్యాయం కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. బీసీ నాయకులు ఈ సన్మానం ద్వారా డాక్టర్ చదలవాడ అరవింద బాబు పట్ల తమ సంఘీభావాన్ని, మద్దతును తెలియజేశారు.

## పేదల ఆకలి తీర్చేవే అన్న క్యాంటీన్ లు నగర కమిషనర్ కమిషనర్ వెల్లడి



**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్:** అన్న క్యాంటీన్లను పేదల ఆకలి తీర్చే అన్నపూర్ణగా ప్రజలు ఆదరిస్తున్నారని, క్యాంటీన్ కి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం అందించేందుకు అక్షయ పాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం అమరావతి రోడ్ లోని అన్న క్యాంటీన్ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ఏర్పాటు చేసిన 7 అన్న క్యాంటీన్లకు ప్రతి రోజు ఆహారం కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతూ ఉందన్నారు. అక్షయపాత్ర సిబ్బంది ప్రతి రోజు ఇండెంట్ రూపొందించేప్పుడు క్యాంటీన్ కి వచ్చే వారికి ఆహారం అందలేదని ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. అలాగే జిఎంసి నుండి క్యాంటీన్ల వారీగా విధులు కేటాయించిన నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మౌలిక వసతులు కల్పించాలన్నారు. క్యాంటీన్లలో శుచి, శుభ్రత పాటించాలని స్పష్టం చేశారు.

### పొన్నూరులో ఆర్డీఎస్ఎస్ పనులు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**మొదటిపేజీ తరువాయి**

సబ్ స్టేషన్ నుండి అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ వున్న సర్వీసుల వివరాలు , లోడ్, ఏపి గ్రామాలకు సరఫరా చేస్తున్న వివరాలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎండి పుల్లారెడ్డి వివరిస్తు నిడుబ్రోలు సబ్ స్టేషన్ లో ఫీడర్ బైఫర్ కేషన్ ఆర్ డి ఎస్ఎస్ క్రింద అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ (వ్యవసాయ, వ్యవసాయేతర) ఫీడర్ బైఫర్ కేషన్ క్రింద చేపట్టిన పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించడం జరిగింది. గుంటూరు, బాపట్ల జిల్లాలలో వున్న అన్ని ఫీడర్లలో వున్న వ్యవసాయ , వ్యవసాయేతర సర్వీసులు వేరు చేస్తున్న ఫీడర్ బైఫర్ కేషన్ పనులను 3 నెలలలోగా సెప్టెంబర్ చివరకు పూర్తి చేసి గ్రామాలకు 24 గంటల నిరంతరాయంగా నాణ్యమైన 3 ఫేజ్ విద్యుత్ ను సరఫరా చేయడం జరుగుతుంద న్నారు. దానికి సంబంధించిన పనులన్నిటిని ప్రోగ్రాం చేయడం జరిగిందని, సెప్టెంబర్ కు మొత్తం గ్రామాలను పూర్తి చేసి 3 ఫేజ్ కరెంట్ సప్లై చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వడ్డెముక్కల గ్రామానికి 3 ఫేజ్ విద్యుత్ సరఫరా పూర్తి అయిందని , వ్యవసాయానికి పగటిపూట నిరంతరం 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ పనులు చేయడంతో పాటు వాటిని రికార్డు చేయాలని, ప్రజల మన్ననలు అందుకునేలా సిబ్బంది ఏమరిపాటు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.సి.పి.డి.సిఎల్ సిజిఎం హెచ్ ఆర్డి లింగమూర్తి , ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవిఎస్ ఎన్ మూర్తి, టెక్నికల్ డైరెక్టర్ మురళి కృష్ణ యాదవ్, ఈఈ ఎలక్ట్రికల్ భాస్కరరావు, ఈఈ టెక్నికల్ మల్లికార్జున రావు, ఈఈ బాపట్ల రాజేష్ ఖన్నా, పొన్నూరు ఏడి వెంకటేశ్వరరావు, ఏఇ శంకరరావు, తహసిల్దార్ జయా ఉల్ హక్, యంపిడిఓ శ్రీనివాస్, మున్సిపాల్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పాముసుగులో వ్యభిచారం..!

**నేటిదినపత్రిక సూర్య, గుంటూరు/పల్నాడు జిల్లా బ్యూరో:** పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, గుంటూరు జిల్లా లోని కొన్ని స్పా సెంటర్లు వ్యభిచార గృహాలుగా మారిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెల్‌నెస్, మసాజ్ పేరుతో బోర్డులు పెట్టి, లోపల చీకటి వ్యవహారాలు నడుపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందలకి పైగా మసాజ్ సెంటర్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయి. "బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్ యాక్ట్"ను ఉల్లంఘించి తమ సెంటర్లలో అందించే సేవలకు పోలీసుల నుంచి ఆటంకం లేకుండా ఉండేందుకు నెలవారీ మామూళ్లు ముట్టజెపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. స్పాల్లో అందజేసే సేవలను బట్టి ఈ మాముళ్ల నిర్ణయించడంతో పాటు వసూలు చేసి పోలీసులకు అప్పగించే బాధ్యతను కూడా కొన్ని సెంటర్ల నిర్వాహకులే తీసుకుంటున్నట్లు కొందరు స్పా నిర్వాహకులు చెబుతున్నారు. క్రాస్ మసాజ్‌లు చేసే సెంటర్లు అయితే నెలకు రూ.10 వేలు, అదే వ్యభిచారం అనుమతించే స్పా సెంటర్లు అయితే రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ మామూళ్లు అందజేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. శారీరకంగా అలసిపోయిన వారికి, కండరాల బిగుసుకుపోయే సమస్యతో బాధపడుతున్న వారికి వాటి నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు కాస్మోటిక్స్ (అందానికి)కు సంబంధించిన సేవలు మాత్రమే 'స్పా'లు, వెల్‌నెస్ సెంటర్లలో అందించాలి. ఇవన్నీ 'బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్' రంగం కింద గుర్తించబడతాయి. స్పా, మసాజ్ సెంటర్‌లు, రిలాక్స్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్స్ వంటి పేర్లతో ఇవన్నీ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఇలాంటి వాటిలో క్రాస్ జెండర్ (మగవారికి ఆడవాళ్లు, ఆడవారికి మగవారు) మసాజ్ చేయడాన్ని చట్టం అనుమతించదు. మసాజ్ సెంటర్/స్పాలో చీకటి కార్యకలాపాలకు తావులేకుండా ఉండేందుకు పురుషులకు, మహిళలకు వేర్వేరు సెక్షన్లు ఏర్పాటు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. స్పాల్లోకి వెళ్లేవారికి ఒక మార్గం, బయటకు వచ్చేవారికి మరొక మార్గం వేర్వేరుగా అందుబాటులో ఉంచాలి. పురుషులకు, మహిళలకు టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు కూడా వేర్వేరుగా ఏర్పాటుచేయాలి. స్పా/మసాజ్ సెంటర్లలో ఒక గది నుంచి మరొక గదిలోకి వెళ్లేందుకు అంతర్గత ద్వారాలు ఉండకూడదు. పది మంది కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్నట్లయితే వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడం, మహిళా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగం వంటివి అందుబాటులో ఉంచాలి. మసాజ్ సెంటర్/స్పాలో ఫిజియోథెరపిస్ట్ లేదా ఆక్యుప్రెజర్ లేదా ఆక్యుపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను మాత్రమే నియమించుకోవాలి. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ మాత్రమే తెరిచి ఉంచాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను రికార్డు చేసేలా అన్నిచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలి. కనీసం మూడు నెల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కానీ నగరంలోని మసాజ్‌సెంటర్/స్పాల్లో మాత్రం ఈ నిబంధనలేవీ మచ్చుకైనా అమలుకావడం లేదనేది బహిరంగ రహస్యం.


**మసాజ్ ముసుగులో వ్యభిచారం..**

ఉమ్మడి జిల్లాలలోని మసాజ్ సెంటర్‌లు/స్పాల్లో కొన్నింటిలో మినహా మిగిలిన వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నరసరావుపేట పట్టణం, గుంటూరు కు తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే విటులు అమ్మాయిలు కావాలని సంప్రదించిన స్పా కస్టమర్లకు ఫోన్ నెంబర్ ఇస్తారు. అనంతరం సంప్రదించిన కస్టమర్లకు స్పా లొకేషన్ పంపుతారని చెప్పుకొస్తున్నారు.

# స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన నగర కమిషనర్**

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సమస్యలపై ప్రజల నుండి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధగా ఉండాలని, ఫిర్యాదులను ర్యాండమ్ గా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు తెలిపారు. మంగళవారం పిజిఆర్ఎస్ కి అందిన ఫిర్యాదు మేరకు గోరంట్ల అన్నపూర్ణ నగర్, సరస్వతి కాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలు తమ స్థానిక సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉండడానికి వీలు లేదని, నేరుగా అర్జీదారులతో తామే మాట్లాడుతామన్నారు. అన్నపూర్ణ నగర్, సరస్వతి కాలల్లో మౌలిక వసతుల సమస్యలపై అందిన అర్జీని పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఈఈని ఆదేశించారు. అలాగే త్రాగునీటిని



అన్ని ప్రాంతాలకు నిర్దేశిత సమయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నపూర్ణ నగర్ 5 వ లైన్ లో పెద్ద చెట్టుని అనుమతి లేకుండా నరికివేయడం గమనించి, స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణం వారిపై వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేసి, నోటీసులు ఇచ్చి, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. సదరు ప్రాంతంలోనే మ్యాన్ హోల్ రోడ్ లెవల్ కి కిందకు ఉండడం, సిసి రోడ్, డ్రైన్ వెంబడి గ్యాప్, నిర్మాణ వ్యర్థాలు ఉండడం గమనించి తక్షణం మ్యాన్ హోల్ ని పైకి నిర్మాణం చేయాలన్నారు. డ్రైన్, రోడ్లకు మధ్యలో గ్యాప్ లేకుండా, నిర్మాణ అనంతరం వ్యర్థాలు తొలగించడం సంబంధిత కాంట్రాక్టర్ దే బాధ్యత అని, అందుకు తగిన విధంగా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి, ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, స్థల యజమానులను గుర్తించి,స శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించని వారి స్థలాలో జిఎంసి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, డిఈఈ శ్రీనివాస్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సంక్షేమ రథం.. అభివృద్ధి పథం

- **గడపగడపలో విల్లివిరుస్తోన్న వసంతం**
- **ఏడాది కూటమి పాలనకు ఇదే నిదర్శనం**
- **గుంటూరు తూర్పులో మార్పునకు శ్రీకారం**
- **సుపరిపాలన-తొలి అడుగులో భాగంగా 2వ డివిజన్ లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రెండో డివిజన్ ఆర్టీసీ కాలనీలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఏడాది కాలంలో తమ ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన నాయకుడు రావడంతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుపరిపాలన-తొలి అడుగుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంచుతూ ఎమ్మెల్యే నసీర్ ముందుకు సాగారు. పార్టీ పథకాల అమలుపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హులెవరికైనా పథకాలు అందకపోతే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీలో వర్షం పడితే అడుగుపెట్టాలంటే గుంతలమయంగా ఉండేవని, ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని 20 ఏళ్ల



వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. కనీస మౌలిక వసతుల గురించి పట్టించుకోకుండా దోపిడీ మాత్రమే చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను 90 శాతం అమలు చేశామని వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, తల్లికి వందనం, వాట్సాప్ గ్రీవెన్స్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యామని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పథాన నడిపిస్తామని చెప్పారు.

**వృద్ధురాలు ఇంటి నిర్మాణానికి హామీ**

ఆర్టీసీ కాలనీలో పీ శ్రీలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బ తినడంతో ఎమ్మెల్యే నసీర్ వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటి పైకప్పు నిర్మాణానికి తన సొంత నిధులు వెచ్చిస్తానని ఆ వృద్ధురాలికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీలా, క్లస్టర్ ఇంచార్జ్ సయ్యద్ అస్లర్, డివిజన్ అధ్యక్షులు జబీ ఖాన్, బెల్లా వెంకటేశ్వర్లు, కోటా పిచ్చిరెడ్డి, మొవ్వ శైలజ, బాబు, ఖాజీ, దిలీప్, శాంతి, దాసు, డేవిడ్, మహేష్, దాసరి శ్రీను, సుభాని, బుచ్చిబాబు, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లి ఆర్టీసీలో ఆన్ కాల్ డ్రైవర్ కొరకు దరఖాస్తు చేసుకోండి



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :**
ఆర్టీసీ డిపో నందు ఆన్ కాల్ డ్రైవర్‌గా పని చేసెందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ జి. ఎస్. వి. వి. కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదవటం, రాయటం వచ్చి వుండాలని, హెవి వెహికల్ లైసెన్సు కలిగి 18 నెలలు గడిచి ఉండాలని, హెవి వెహికల్ లైసెన్సు ఫోర్సులో ఉండాలన్నారు. సంస్థ నిబంధన ప్రకారం డ్రైవింగ్ చేసిన యెడల వారికీ ప్రతి దినము రూ. 800 లు జీతం ఇవ్వబడుతుందన్నారు. ఈ అర్హతలు గల వారు ఆగష్టు 02వ తేది లోపు డిపో మేనేజర్ వారి కార్యాలయంకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225429, 7382897583 లను సంప్రదించాలని సూచించారు.

# బ్యాడ్మింటన్ క్రీడల్లో కెఎల్‌యు విద్యార్థులకు కాంస్య పతకం




**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఈనెల 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో వడ్డేశ్వరం కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు కాంస్య పతకాన్ని సాధించినట్లు యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె. హరికిషోర్ మంగళవారం తెలిపారు. జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కెఎల్ యూనివర్సిటీ నుండి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ విద్యార్థులు బ్యాడ్మింటన్ ఈవెంట్లలో పతకాలు సాధించడం ద్వారా విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చారన్నారు. వైష్ణవి ఖడ్కేకర్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో ఏఆర్ రోహన్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు. మోహిత్ చౌదరి హాఫ్ మారథాన్‌లో 4వ స్థానాన్ని సాధించి అసాధారణమైన అథ్లెటిజాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ అధికారులు, విద్యార్థులు పతక విజేతలకు, పాల్గొన్నవారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్ధి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్. ఎస్. ప్రసాద్, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె. హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు పాల్గొని విద్యార్దులను అభినందించారు.

# మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరి

## – ఏపీ ఎంఎస్‌ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో దేశానికే రోల్ మోడల్ గా మంగళగిరి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఏపీ ఎంఎస్‌ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగర పాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా తెనాలి రోడ్డు విస్తరణ విషయమై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషా సమక్షంలో చేనేత వ్యాపారులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. తెనాలి రోడ్డు విస్తరణలో భాగంగా ముస్లిం స్మశాన వాటిక, బాప్టిస్ట్ చర్చి, దేవాలయాలకు చెందిన నిర్మాణాలను పాక్షికంగా తొలగించాల్సి ఉండటంతో మత పెద్దల అభిప్రాయాలను తీసుకున్నారు. ప్రాథమిక ప్రణాళిక నమూనాలను ప్రజలకు వివరించి స్థానికుల సూచనలు తీసుకుని రోడ్ల అభివృద్ధికి కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీఎంఎస్ ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... మంగళగిరి చేనేత ఉత్పత్తులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, ఇలాంటి ప్రాంతాలను అభివృద్ధి చేసే విషయంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎవరికి అన్యాయం జరగకుండా, మతపరమైన ఐక్యతను పరిరక్షిస్తూ రోడ్ల నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు, ఇప్పటం వంటి గ్రామాల్లో రాత్రికి రాత్రే బుల్డోజర్ల తో కొన్ని నివాస గృహ నిర్మాణాలను కూల్చి వేశారని గుర్తు చేశారు. నేటి కూటమి పాలన పూర్తిగా ప్రజల అభిమతానుసారంగా జరుగుతోందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ప్రతి ఇంటిలో ఒక బిడ్డలా... తమ్ముడిలా... అన్నలా...ఉంటూ ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వాన్ని వారివద్దకే తీసుకెళ్లే నేతగా పనిచేస్తున్నారన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పడవల మహేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ ఏసీపీ అశోక్ కుమార్ తో పాటు పలువురు కూటమి నాయకులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, చేనేత వ్యాపారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్లో సరైన వసతులు లేవు



**వట్టి చెరుకూరు, మేజర్ న్యూస్ :**
మండల కేంద్రంలో వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ లో సరైన వసతులు లేవని గుంటూరు జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చిన్నాబత్తిన వినోద్ అన్నారు. మంగళవారం సాయంత్రం వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ బాత్రూములలో సరైన వసతులు లేవని విద్యార్థులకు ప్రస్తుతం వార్డెన్ కూడా లేడని విద్యార్థులు వాపోతున్నారని తెలిపారు.

హాస్టల్లో ఉన్నటువంటి వసతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆగస్టు 1వ తేదీన గుంటూరు కలెక్టరేట్ ముట్టడించి కలెక్టర్కు మె మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని అయన చెప్పారు. అదేవిధంగా ఈ సమస్యలపై స్పందించకుంటే ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి నాదెండ్ల రామ చంద్రయ్య కుర్నూతుల సర్పంచి గోపాలకృష్ణ వట్టిచెరుకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు మండలంలోని విద్యార్థులు పాల్గొన్నారు

# రూ. 2 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కు అందజేత



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి పట్టణం 15వ వార్డుకు చెందిన రాపూరి వినోద్ కుమార్ కుమారుడు ఆదిత్య విజయవాడలోని అనురాగ్ పిల్లల హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం బాలుడి తండ్రి రాపూరి వినోద్‌కు రూ. 2 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కును అందజేశారు. సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి సీఎం చంద్రబాబు నాయుడు తన సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షులు మాతంగి రవి కిరణ్, బుల్లా పిచ్చయ్య, కొదమల సురేష్ (సైమన్), బుల్లా రాము, రావూరి విజయ్ నంద్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు కాంశ్య పతకాలు సాధించిన ఎస్ఎస్ఎన్ కాలేజ్



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
25-07-2025 శుక్రవారం నుండి 27-07-2025 ఆదివారంవరకు కృష్ణా జిల్లా టైక్వాండో అసోసియేషన్ వారి ఆధ్వర్యములో విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 10వ జాతీయ ఓపెన్ జూనియర్ అండ్ సీనియర్ క్యోరుగి & పూంసే టైక్వాండో ఛాంపియన్షిప్ -2025 లొ స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి యమ్ సాయి శ్రీకర్ అండర్ 73 కేజీస్ వెయిట్ క్యాటగిరి లొ అండర్ 17 ఏజ్ గ్రూపులొ టైక్వాడో క్యోరుగి పుంసే విభాగలలో రెండు కాంశ్య పతకాలు సాదించాడని, అలాగే నర్సింగ్ 2 సంవత్సరం విద్యార్థిని వి. తులసీ తన్మయ్ ఓపెన్ క్యాటగిరిలో అండర్ 46కేజీస్ వెయిట్ క్యాటగిరిలొ పాల్గొని, కాంశ్య పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఎస్ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపినారు. 10వ జాతీయ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ -2025 లొనర్సింగ్ విదర్థిని వితులసీ తన్మయ్ కాంశ్య పతకం, జూనియర్ ఎంపీసీ విద్యార్థి యమ్. సాయి శ్రీకర్ 2 కాంస్య పతకాలు సాదించిన శుభసందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ సెక్రెటరి అండ్ కరెస్పాండెంట్ మరియు నరసరావు పేట మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ నాగసరపు సుబ్బారాయగుప్త జాయింట్ సెక్రెటరి వూటుకూరి వెంకట అప్పారావు పాలకవర్గసభ్యులు వైస్ ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస సాయి వ్యాయమ అధ్యాపకులు యక్కల మధుసూదనరావు నర్సింగ్ ఇంచార్జ్ ఎ వి యన్ గుప్త అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు తమ అభినందనలు తెలిపినారు.

# సాంకేతిక అంశాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలి

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్క సాంకేతిక సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో వి. జ్యోతిబసు సూచించారు .మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టి. ఎం. పి ట్రైనింగ్ మోర్టల్, ప్రగతి మోటర్పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాలకు లోని వివిధ మండలాలకు చెందిన శిక్షణ సిబ్బందితో పాటు రిసోర్స్ పర్సన్ రవీంద్రబాబు, డీటీఎంకె నాగేశ్వరరావు, కరీముద్దీన్, అనురాధ, డి పి ఆర్ సి ఏ ఓ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా సినారె జయంతి



**చిలకలూరిపేట, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఆర్వీయస్ హైస్కూల్‌లో మంగళవారం జన విజ్ఞానవేదిక , లాలూ దాదా సాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగళ్ళ సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డా. పీవీ. సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. నారాయణరెడ్డి రాసిన కావ్యలగురించి ఆయన వివరించారు. ఆయనరాసిన గజళ్ళు, ప్రపంచ పదులు పాడి వినిపించారు. బాలసాహితీవేత్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డా దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ సి. నారాయణరెడ్డి 3వేలకు పైగా సినిమా పాటలు రాశారన్నారు. బాలగేయలు కూడా అనేకం రాశారన్నారు. తెలుగుజాతి మనది, భారత మాతకు జేజేలు వంటి దేశభక్తి పాటలు రాసి పిల్లల కు దేశభక్తి ఉద్బోధించారు. తొలుత సి. నారాయణ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి 3వేల రూపాయల విలువైన బాలసాహిత్య గ్రంథాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణ మంటపం ప్రధాన కార్యదర్శి చేవూరి కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకై గంబూసియా చేపలు విడుదల



**తెనాలి, మేజర్ న్యూస్ :** దోమలను లార్వాదశలోని నియంత్రించేందుకు పట్టణంలోని సత్యనారాయణ లేక్ పార్క్ లోనున్న చెరువులో గంబూసియా చేపలను విడుదల చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎటువంటి రసాయనిక పదార్థాలు వినియోగించకుండా జైవిక విధానంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఈ గంబూసియా చేపలను విడుదల చేయుట ద్వారా దోమ లార్వాదశలోనే తినివేయడం వలన దోమల ఉత్పత్తి తగ్గిపోతుందని అన్నారు. ఒక్క గంబూసియా చేప ఒక్క రోజుకి 180 నుంచి 300 దోమల లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని తెలిపారు. ఈ చేపలు సుమారు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు బ్రతికి ఉంటాయని 42 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకుంటాయని అన్నారు. తక్కువ నీటి పరిమాణం ఉన్న నీటి గుంటలలోనూ ఆక్సిజన్ తక్కువ ఉన్న నీటిలోనూ ఇవి బాగా పెరుగుతాయని దోమల నియంత్రణకై తెనాలిమలేరియాశాఖవారి సహాయ సహకారాలతో తెనాలి పట్టణంలో గల వివిధ ప్రాంతాలలో గంబూసియా చేపలను విడుదల చేశామని తెలిపారు. ప్రజలు ఇంటి లోపల ఇంటి బయట నీటి నిలువ లేకుండా చూసుకొని దోమలు నివారణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమీషనర్ లక్ష్మీపతిరావు, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఎస్‌హెచ్ఐ, జి.రవికుమార్ ఉన్నారు.

# ఉత్తమ పి.ఎం శ్రీ హైస్కూల్ గా తాళ్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్







**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** జాతీయ విద్యా విధానం ఎం ఈ పి–2020 ఐదవ వార్షికోత్సవం సందర్భంగా భారత్ మండపం న్యూ డిల్లీలో కేంద్ర విద్యాశాఖ మాత్యులు ధర్మంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేయగా స్థానికంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ,ఏపీసి ఆర్.రమేష్,ఎ‌ఎంవో పూర్ణచంద్రరావు మంగళవారం అంకితం చేశారు.దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో 75 త్యాళ్ళూరు హైస్కూల్ ఉండటం విశేషం.ఈ సందర్భంగా డిఇవో చంద్రకళ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో నాణ్యమైన,గుణాత్మకమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు పీఎంశ్రీ పథకం ఎంతగానో దోహద పడుతుందని,ఇది పాఠశాలలకు ఒక వరము లాంటిదని అని అన్నారు. న్యూఢిల్లీ నుంచి ప్రసారమైన వివిధ కార్యక్రమాలను విద్యార్థులు అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,వీక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,ఎస్ఎంసి చైర్ పర్సన్ బి.చంద్ర కుమారి, మండల విద్యాశాఖ అధికారి టి.సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులు ఎ. శ్రీనివాస రెడ్డి,ఎ.ఇ.అనుముల శ్రీనివాస రెడ్డి,క్లస్టర్ సిఆర్ఎంటి శివ,తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సింగపూర్ పర్యటనపై దుష్ప్రచారం చేసే స్థితికి జగన్ దిగజారాడు : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, మేజర్‌న్యూస్:** అసలు ఎప్పటికీ, ఎవరూ బాగుచేయని విధంగా రాష్ట్రాన్ని తాము నాశనం చేసినా.. చంద్రబాబు, కూటమిప్రభుత్వం తిరిగి ఏపీ పునర్నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు వేయడాన్ని జగన్ అండ్ కో జీర్ణించుకోలేకపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము సృష్టించిన ఆర్థికలోటును భర్తీ చేస్తూ, ప్రజలు మెచ్చేలా సంక్షేమపథకాలు అందిస్తూ, మరోవైపు రాష్ట్రాభివృద్ధికి కీలకమైన పెట్టుబడులు సాధించేందుకు, కంపెనీలను ఆకర్షించేందుకు చంద్రబాబు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తుండటాన్ని జగన్ భరించలేకపోతున్నాడని చెప్పారు.తనకున్న మానసిక రోగం రోజురోజుకీ ఎక్కువైపోతూ, ఆయన ప్రశాంతంగా ఉండలేకపోతున్నాడని, ఆ భరించలేని ప్రవర్తనతోనే చంద్రబాబు గొప్ప సదుద్దేశంతో చేపట్టిన సింగపూర్ పర్యటనపై తన అవినీతి మీడియాలో, వైసీపీవారితో బురద జల్లిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కృషి ఫలించి, సింగపూర్ పర్యటన ఫలప్రదమై రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే ప్రజలు తన కుట్ర రాజకీయాలను నమ్మరన్న దుర్భుద్ధితోనే జగన్ దుష్ప్రచారానికి తెగబడ్డాడన్నారు. సింగపూర్ ప్రభుత్వం, ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వ్యాపారదిగ్గజాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు వెల్లడించే అంశాలు, రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల వినియోగంపై పూర్తి సానుకూలత వ్యక్తం చేస్తూండటం నిజంగా రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమైతే, జగన్‌కు, వైసీపీకి మాత్రం మింగుడు పడని అంశ మన్నారు. జగన్ ఎన్ని కుట్రలుచేసినా.. కుయుక్తులు పన్నినా గత ఎన్నికలలో ప్రజలు ఆయన్ని నమ్మలేదని, ఐదేళ్ల రాక్షసపాలనకు అంతంపలికి భారీ మెజారిటీతో కూటమిపార్టీలను గెలిపించి, జగన్ ను కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. రానున్న నాలుగేళ్లలో చంద్రబాబు చేసే అభివృద్ధి.. ప్రజలకు అందించే విలువైన సంక్షేమంతో జగన్ కు భరించలేని శిరోభారం, ఆయన పార్టీ రాజకీయంగా సమాధి కావడం తథ్యమని జోస్యం చెప్పారు.

# జూలై 31లోగా భీమా చేయించుకోవాలి

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** ఈనెల 31వ తేదీ లోపు ప్రత్తి, మిరప, కంది రైతులందరు పంటల భీమా చేయించుకోవాలని డి కృష్ణయ్య కోరారు. మంగళవారం మండలంలోని గారపాడు, హుస్సేనగరం, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగినది. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ రుణాలు పొందని రైతులకి పంటల భీమా పై అవగాహన కల్పించి వాతావరణం ఆధారిత పంటల భీమా పథకం క్రింద ప్రత్తి పంట ఎకరాకు రూ 1900/– చొప్పున మరియు దిగుబడి ఆధారిత పంటల భీమా (పిఎంఎఫ్‌బివై)క్రింద కంది ఎకరాకు రూ. 40/–, ఎర్ర మిరప ఎకరాకు రూ. 360/– చొప్పున జులై 31 తేదీలోగా వరికి ఎకరాకు రూ. 80/– ఆగష్టు 15 వ తేది లోగా దగ్గర లోని కామన్ సర్వీస్ సెంటర్స్ లేదా సచివాలయం వద్ద ప్రీమియం చెల్లించాలని కోరారు. గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది నుండి పంట సాగు పత్రము తీసుకొని ప్రీమియం కామన్ సర్వీస్ సెంటర్స్‌లో చెల్లించాలని, బ్యాంక్ లోన్ తీసుకొనే రైతులకు లోన్ నగదు నుండే రైతు అనుమతి తో ప్రీమియం చెల్లించబడుతుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్ 2025 లో వాస్తవ పంట సాగు చేయు రైతులు అందరిని పంట నమోదు చేయాలని ముఖ్యంగా కౌలు కి సాగు చేయు రైతులు గ్రామ రెవిన్యూ అధికారి సహకారంతో పంట సాగుదారు హక్కు పత్రాలు పొంది పంట నమోదు చేయించు కొనినచో ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలు లబ్ది పొందే అవకాశం కలదని తెలిపినారు ముఖ్యంగా పంటలు కనీస మద్దతు ధరలు పొందుటకు, వడ్డీ లేని రుణాలు, పంట నష్టం పరిహారం, పంటల భీమా తదితర రైతు సంక్షేమ పథకాలు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి క్రిష్ణయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శివపార్వతి రైతు సేవా కేంద్ర సిబ్బంది మహేష్,సుచరిత ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# గంట వ్యవధిలోనే బాలిక ఆచూకీ గుర్తించిన పోలీసులు

**– సీఐ గంగా వెంకటేశ్వర్ల కి పలువురు అభినందనలు**



**గుంటూరు క్రైమ్ మెజర్ న్యూస్ :**

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 9 సంవత్సరాల బాలిక తప్పిపోయిందని బాలిక తల్లి దండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు సోమవారం ఉ.గం.7ల సమయంలో కోబాల్ట్ పేట 6వ లైన్‌కు చెందిన బలస శిరీష (9) బాలిక ఇంటి నుండి తప్పిపోయిందని ఆమె తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి చుట్టుపక్కల విచారించి సీసీ కెమెరాల సహాయముతో గంట వ్యవధిలోనే బాలికను పీకల వాగు వద్ద ఆచూకీ కనుగొని బాలికను తల్లి దండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలిక ఆచూకీ గంటలోనే పట్టుకోవడంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు ఆనందము వ్యక్తం చేసి పోలీసుల కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లుని ప్రత్యేకంగా బాలిక బంధువులు, పలువురు అభినందించారు.

# అందరూ బాగా చదవాలి







**– జస్టిస్ లావు నాగేశ్వరరావు**

**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :** పాఠశాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు అనేక మంది దాతలు ముందుకు వస్తున్నారని వాటిని వినియోగించుకొని విద్యార్థులు బాగా చదివి, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితం స్థిరపడిన తర్వాత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉదయం పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాట్స్ మరియు పూర్వ విద్యార్థుల సహకారంతో షుమారు 13 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను జస్టిస్ లావు నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ప్రపంచంలో ని అన్ని దేశాలలో స్థిరపడ్డారని వారు పాఠశాల అభివృద్ధి కి సహకరిస్తారని, గ్రామానికి మంచి చేయాలనే అందరూ ఉన్నారని దానికి గ్రామస్తులు అందరూ సహకరించాలని గ్రామస్తులకు తెలియజేసారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి సహకరిస్తున్న నాట్స్ బృంద సభ్యులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు మంచి పౌష్టికహారం అందిస్తే వారు బాగా చదువుతారని, వారికి మంచి పౌష్టికహారం అందిచటానికి దాతలు ముందుకు రావాలని నా వంతు సహాయం నేను చేస్తానని అయన చెప్పార. స్థానిక శాసన సభ్యులు బి రామాంజనేయులు మాట్లాడుతూ ఈ నేల మాకు కొంత ఇచ్చింది మేము కూడా ఈ నేల కు కొంత ఇద్దాం అని ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధి కి సాయం చేస్తున్న నాట్స్ బృందం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. తదనంతరం పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాతలు నూతి సుబ్బారావు, సీతాదేవి, పాఠశాల హెచ్ ఎం గోవిందు శ్రీనివాస్, నాట్స్ బృందం సభ్యులు ప్రశాంత్, ఎం శ్రీహరి, బి శ్రీనివాసరావు, దాసరి రమేష్, రఘురామ్, పూర్వ విద్యార్థులు నర్రా బాలకృష్ణ, రావి శివరామకృష్ణయ్య, ఎ కృష్ణమూర్తి, దాసరి శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఎస్పీ




**నరసరావుపేట మేజర్ న్యూస్ :**

మంగళవారం కలెక్టర్ ఆఫీసు నందు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధ్యక్షతన జిల్లా మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసినట్లు,మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో అసంపూర్తిగా నిర్మించిన భవనాలు, ఖాళీగా వదిలివేసిన భవనాలలో కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదై, ఎక్కువ మొత్తంలో గంజాయి సరఫరా చేస్తూ లేదా అమ్ముతూ దొరికిన వారి ఆస్తులు జప్తు చేస్తామన్నారు.మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు స్కూళ్లస్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థలలో ఈగిల్ క్లబ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. డీ–అడిక్షన్ సెంటర్లు, పునరావాస సహాయం కోసం అవుట్‌రీచ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఏరియా హాస్పిటల్ నందు ఉన్న డీ–అడిక్షన్ సెంటర్ కొత్తగా ఏర్పాటైన డీ–అడిక్షన్ సెంటర్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని డిహెచ్ఎంఓ రవి ని కోరారు. మాత జ్ఞానమ్మ డీ–అడిక్షన్ సెంటర్ ను సైకియాట్రిస్ట్ నెలకు రెండు సార్లు విజిట్ చేయాలన్నారు.మాదక ద్రవ్య దుర్వినియోగ నిర్మూలన లో బాధ్యతాయుతమైన అన్ని శాఖల సమన్వయంతో చురుకుగా పాల్గొనాలన్నారు. మాదక ద్రవ్యాల పై అవగాహన ఇంటర్ – డిపార్ట్‌మెంటల్ సహకారంతో వీలైనన్ని ఎక్కువ అవగాహన కార్యక్రమాల ద్వార విద్యార్థులు మరియు ప్రజలలో మాదక ద్రవ్యాల వాళ్ళ కలిగే నష్టాలపై చైతన్యం కలిగించాలని తెలిపారు.

ఈ సమావేశంలో కలెక్టర్,ఎస్పీ తో పాటు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కలువ రవీంద్ర ,జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ రవి, ఏం. ప్రసూన, డి సి హెచ్ ఎస్జి.పి.ఎస్ రాజు , సైకియాట్రిస్ట్ డి. ఈ.ఓ ఆఫీసు అధికారి కేఎంఏహుస్సేన్ ఆఫీసు అధికారి డి ఎస్. వెంకటేశ్వర రావు , ఏ.జి.అండ్ ఏం.సి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమాదికారి ఏం. ఉమాదేవి గ,జిల్లా పంచాయతీ రాజ్ అధికారి, ఎస్.వి.నాగేశ్వర నాయక్, అధికారి ఏ.పి గోపిరెడ్డి జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ సునీత , ఎస్ బి సిఐ – 2 పి శరత్ బాబు ఈగల్ సెల్ మెంబెర్ షైక్ సుభాని పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

### – సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ లావణ్య వేణికి వినతి



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ అన్నారు. తాడేపల్లి లోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ లావణ్య వేణిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్నటువంటి విద్యార్థులు దయనీయమైనటువంటి స్థితిలో ఉన్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. పెరిగిన ధరలు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో శిథిలావస్థలో ఉన్నటువంటి బిల్డింగ్ లో ఉంటూ భయభ్రాంతులతో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న వార్డెన్, కమాటి, కుక్, వాచ్మెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. మహర్షి, రాష్ట్ర కార్యదర్శి ఐ. రాజేష్ పాల్గొన్నారు.



## ఆరుగురు విద్యార్థుల దత్తత

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రోత్సాహంతో P–4 కార్యక్రమంలో భాగంగా ఆరుగురు విద్యార్థులను 75తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్న కుమార్ దత్తత తీసుకొని వారి భవిష్యత్తుకు మద్దతుగా నిలిచారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యులు ప్రవీణ్ సమక్షంలో దత్తత కార్యక్రమం జరిగింది. మండలంలోని జలాల్ పురం గ్రామానికి చెందిన శిరీష,నీలిమ పెదకూరపాడు గ్రామానికి చెందిన సుష్మ, మణికంఠ, కంభంపాడు గ్రామానికి చెందిన ప్రదీప్,హర్షవర్ధన్ లను తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పీ–4 కార్యక్రమంలో భాగంగా దత్తత తీసుకోవడం విద్యార్థుల జీవితాల్లో కొత్త ఆశ నింపుతుందన్నారు. ఇలాంటి వారి స్ఫూర్తితో మరికొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని వారి భవిష్యత్తుకు అండగా ఉండాలన్నారు.

## చిన్నారిని ఢీ కొట్టిన కార్





**నరసరావుపేట మేజర్ న్యూస్ :** సోమవారం సాయంత్రం నరసరావుపేట ప్రకాష్ నగర్ లో ప్రైవేట్ విద్యాసంస్థ సెయింట్ జోసెఫ్ హై స్కూల్ వద్ద వేగంగా వచ్చిన కారు స్కూల్ గేట్ వద్ద ఉన్న విద్యార్థులను ఢీకొట్టింది. పక్కన నిలిపిన ద్విచక్ర వాహనాలను కూడా ఢీకొడుతూ ముందుకు పోయింది. ఈ దుర్ఘటనలో స్కూల్ నుండి బయటకు వస్తున్న ఓ చిన్నారి విద్యార్థిని గాయాలపాలయ్యింది. స్థానికులు వెంటనే స్పందించి చిన్నారి ని దగ్గర ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకుని వెళ్లి వైద్యం చేయించారు . కారు నడిపిన వ్యక్తి వేగం అదుపులో లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్కూల్ వద్ద భద్రతా చర్యలు మరింత బలపర్చాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

## ప్రజా సంక్షేమం సిపిఐతోనే సాధ్యం : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

**రెంటచింతల మేజర్ న్యూస్ :** మాచర్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సిపిఐ కొమెర వీరాస్వామి భవన్ లో మంగళవారం కేతావత్ రంగనాయకులు, షేక్ సైదా అధ్యక్షతన జరిగిన మాచర్ల ఏరియా 16వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కరువైందన్నారు. కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు మోడీ ప్రజలపై లక్షల కోట్లు పన్నుల రూపంలో భారాన్ని మోపుతున్నాడన్నారు. మోడీ చేతిలో సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కీలుబొమ్మలుగా మారారన్నారు. అనాదిగా వెనుకబడిన పల్నాడు ప్రాంతంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే ప్రజలకు ప్రభుత్వాలపై విశ్వాసముంటుందన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. సిపిఐ కుటుంబ సభ్యులంతా ప్రజల పట్ల విశ్వాసంతో ఉంటూ, ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు జంగాల అజయ్ కుమార్ మారుతి వరప్రసాదరావు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పంటలకు మద్దతు ధర లభించకపోవడంతో రైతులు పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్నారన్నారు. జీఎస్టీ, విద్యుత్తు చార్జీల పేరిట లక్షల కోట్లు ప్రజల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. నాడు ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇప్పుడు మోడీతో కుమ్మక్కవ్వడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్




పథకాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. యేటా 15% ఇంటి పన్నులు పెంచటంలో అర్థం లేదన్నారు. నిస్వార్థ పాలన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తోనే సాధ్యమన్నారు. సందర్భంగా వందలాది మంది కార్మికులతో చేపట్టిన ర్యాలీ, రైల్వే గేట్ నుండి పార్టీ కార్యాలయం వరకు సాగింది. ముందుగా పార్టీ కార్యాలయం ముందు సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏరియా కార్యదర్శిగా మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి, కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమెర వెంకట్రావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు నర్రా రంగస్వామి, మాచర్ల, దుర్గి మండలాల కార్యదర్శులు ఎం బాబురావు, కాలా శివయ్య, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత జీవితం ఆదర్శప్రాయం కావాలి

### – సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్




**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** ఉద్యోగ విరమణ కాలం విశ్రాంతి కే కాకుండా, పది మందికి మేలు చేసే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ సూచించారు. ఎం.జి.రోడ్డులోని జీఎస్టీ భవన్ లో మంగళవారం జరిగిన సూపరింటెండెంట్ ఎం.గిరిబాబు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..విధి నిర్వహణలో గిరిబాబు అందించిన సేవలు ఉద్యోగులందరికీ మార్గదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రదర్శించే ప్రతిభా పాటవాలు వల్లే ప్రభుత్వ కార్యాలయాల ప్రగతి ఆధార పడి వుంటుందన్నారు. గిరిబాబు మాట్లాడుతూ..ఉద్యోగుల పట్ల కమిషనర్ అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అనంతరం గిరిబాబును ఘనంగా సత్కరించి, జ్ఞాపిక ను బహుకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు అతీరా ఎస్.కుమార్, రాయలు, ఎం.నాగరాజు ఉద్యోగసంఘాల నాయకులు యుగంధర్, నవీన్ రాజు, టి.వివేకానంద,గద్దె తిలక్, రాజేశ్వరరావు, సీతారామయ్యచౌదరి, పి.ఎన్ వి.ప్రసాద్, బాగ్యరావు, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్ యూలో బాలికల ఆత్మరక్షణా అవగాహనా సదస్సు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ అధ్వర్యంలో మహిళలకు, బాలికలకు ఆత్మ రక్షణ గురించి విజయవాడలోని ఎన్జీఓ, ఇసిఇ సేఫ్ టీం విభాగంతో కలిసి మహిళా అభివృద్ధి సెల్ మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఆత్మరక్షణ శిక్షకురాలు కీర్తిక కెఎల్ యును సందర్శించి బాలికల వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. అవగాహనా సదస్సుకు మహిళా అధ్యాపక సభ్యులు, బోధనేతర సిబ్బంది, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, వ్యోమా సింగ్ తదితరులు పాల్గొన్నారు.


## తెనాలి రోడ్డును హ్యాండ్లూమ్ వాకింగ్ స్ట్రీట్‌గా మార్చాలి

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** తెనాలి రోడ్డును వన్ వేగా అభివృద్ధి చేసి హ్యాండ్లూమ్ వాకింగ్ స్ట్రీట్‌గా మార్చాలని, అదే విధంగా ఖబరస్తాన్‌ను పరిరక్షించాలని పలువురు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం నగరంలోని తెనాలి రోడ్డులో గల కొత్త రామాలయం ఆవరణలో ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తెనాలి రోడ్డు వెంబడి ప్రజలతో సమావేశం నిర్వహించారు. తెనాలి రోడ్డు విస్తరణలో భాగంగా ఉపాధి కోల్పోతున్న ముఖ్యమైన రంగం చేనేత రంగమని, ఇప్పటికే సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను దెబ్బతీయవద్దని స్థానికులు సమావేశం దృష్టి కి తీసుకువచ్చారు. అలాగే మత విశ్వాసానికి ప్రతీక అయిన ముస్లిం ఖబర్ స్థాన్ ను రహదారి విస్తరణ నుంచి మినహాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. తెనాలి రోడ్డును వన్–వే గా చేసి హ్యాండ్లూమ్ వాకింగ్ స్ట్రీట్‌గా మార్చాలని, జాతీయ రహదారిని (NH –16) నేరుగా కలిపే ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. తెనాలి రోడ్డులో అనేక మలుపులు ఉండటం వల్ల విస్తరణకు అంత అనువుగా ఉండదని, చేనేత వ్యాపారానికి ఈ రోడ్డు కేంద్రంగా ఉన్నందున రహదారి విస్తరణ వల్ల చేనేత పరిశ్రమ మరింత దయనీయంగా మారి వ్యాపారులు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదముందని పలువురు నేతన్నలు పేర్కొన్నారు. తెనాలి రోడ్డులో ఉన్న రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ముస్లిం ఖబరస్తాన్, హనుమంతుని మిద్దె, బాలగణపతి దేవాలయం, రామాలయాలు, చర్చి మత విశ్వాసాలకు కేంద్రంగా ఉన్నందున అందరి మనోభావాలను, మత విశ్వాసాలను కాపాడాలని కోరారు. తెనాలి రోడ్డులో హిందూ, ముస్లిం, క్రైస్తవులు చిరు వ్యాపారాలు చేసుకుంటూ అన్నదమ్ములవలె కలసిమెలసి జీవనం సాగిస్తున్నారని, వారి జీవనాధారాన్ని



దెబ్బతీసే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవద్దని కోరారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తెనాలి రోడ్డు విస్తరణ ప్రణాళికను శాశ్వతంగా నిలిపివేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను ఆదుకోవడంతో పాటు ఖబరస్తాన్, దేవాలయాలు, చర్చిలను పరిరక్షించి అందరి మత విశ్వాసాలను కాపాడాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు స్పందించి స్థానికుల అభిప్రాయాలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల అభ్యంతరాలను పరిగణలో తీసుకొని ఎవరి మత విశ్వాసాలకు విఘాతం కలగకుండా అందరి ఆమోదంతోనే ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, టీడీపీ నాయకులు కాంద్రు శ్రీనివాసరావు, రియాజ్, ఆకురాతి నాగేంద్రం, ముస్లిం ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాల్లో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ



**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి హామీలు అమలులో విఫలం అయ్యిందని వైసీపీ పెదనందిపాడు మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా అన్నారు. మంగళవారం సాయంత్రం రెండు గ్రామాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్"అదేశాలు మేరకు, బాబు షూరిటీ – మోసం గ్యారంటీ గడప గడపకు మండల పరిధిలోని అన్నవరం, రాజుపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఖాసీం పీరా ప్రభుత్వం యొక్క వైఫల్యాలు గురించి వివరించారు. అయన వెంట సర్పంచ్ దానమ్మ, ఎంపీటీసీ సుందరరావు, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కొమ్మాలపాటి లక్ష్మి నారాయణ, గద్దె ప్రసాద్, కూరేటి భూషయ్య,చెరుకూరి సాంబశివరావు, అల్లడి వెంకటేశ్వర్లు, గేరా గణేష్, వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# బొంత పద్మ మృతికి సంతాపం



**చిలకలూరిపేట, మేజర్న్యూస్ :** చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామ నాలుగవ వార్డు సీపీఐ సభ్యులు బొంత నాగరాజు తల్లి బొంత పద్మ (55) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ నాయకులు వేలూరు గ్రామంలోని ఆమె స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇంచార్జి కార్యదర్శి తాళ్లూరు బాబురావు,సహాయ కార్యదర్శి బొంత ధనరాజ్, గ్రామ కార్యదర్శి ఏలికా శ్రీనివాసరావు, ఉట్ల వెంకటేశ్వర్లు,గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ బొంత సుబ్బారావు,పార్టీ యూనిట్ కార్యదర్శులు బొంత కోటేశ్వరరావు,సయ్యద్ నానా,పొలకటి యేసు బాబు, షేక్ నన్నే,సౌటుపల్లి నాగేశ్వరరావు,తదితరులు ఉన్నారు.

# ఎల్.వో.సి చెక్కులు పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకులతో కలసి టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు బాధితులకు మంగళవారం అందజేశారు. తాడేపల్లి 20 వ వార్డ్ సీతానగరంకి చెందిన బోగల లీలా రాజేష్ కు రూ. 31365/- మహానాడు 23 వ వార్డు కి చెందిన బెజవాడ లక్ష్మీ ప్రసన్న కు రూ. 43,823/-కేశవరెడ్డి ధనలక్ష్మి కి రూ. 77,100/-ఎల్వోసీ చెక్కులను అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్ కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతోనే లక్షల విలువైన నిధులను సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్,కోర్రపాటి విజయ్ కుమార్,గాజుల క్రిష్ణా, గాడి సాంబశివరావు,సంక్రాంతి అశోక్,సంక్రాంతి వేంకటపతి, కోడి పిల్లల శ్రీకృష్ణ. బక్క లావణ్య, ఎం సుజాత,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** పురుషోత్తపట్నం సబ్ స్టేషన్లోని ఫీడర్లో లైన్ల మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణముగా బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్కుమార్ తెలిపారు. చిలకలూరిపేట టౌన్ 2 పరిధిలోని పురుషోత్తపట్టణం,కోటప్పకొండ రోడ్డు ప్రాంతంలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

# నాగులపాడులో మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ



**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :**

గ్రామం లో 38 సంవత్సరాలు సర్పంచ్గా పనిచేసి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ సర్పంచ్ ఆళ్ళ రాఘవయ్య విగ్రహం ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని జరిగిన ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు చేతులమీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవయ్య సేవలను అయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, నర్రా బాలకృష్ణ, ఆళ్ళ హరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత మహిళ ఆత్మహత్య

### – కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**మంగళగిరి, మేజర్ న్యూస్ :**



నగరంలోని ఓ వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఆంజనేయ కాలనీకి చెందిన చిల్లపల్లి బాలకృష్ణ, చిల్లపల్లి పద్మిని దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు. ఒక కుమారుడికి ఇంజనీరింగ్ సీటు దూర ప్రాంతంలో రాగా అక్కడికి పంపించేందుకు పద్మిని అంగీకరించలేదు. ఈ క్రమంలో పద్మిని బాలకృష్ణ దంపతులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. క్షణికావేశంలో పద్మిని నివాసంలో ఆదివారం ఫ్యాన్కు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే భర్త ఎన్నారై వైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే పద్మిని మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. పద్మిని అన్న కేసనం సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాయక్ సోమవారం తెలిపారు.

# విద్యుత్ బకాయి చెల్లించిన మద్దాలగిరిపై చర్యలు తీసుకోవాలి

### – కలెక్టర్ నాగలక్ష్మికి అర్జీ అందజేసిన ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు సుభాని

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరికి చెందిన శ్రీ వెంకట శివ పార్వతి స్పిన్నింగ్ మిల్లుల 42 కోట్ల పైబడి విద్యుత్ బకాయి వసూలు చేయాలని, పెద్ద మొత్తంలో బకాయికి కారణమైన అప్పటి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది షేక్ సుభాని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మద్దాలగిరి కి చెందిన శ్రీ వెంకట శివ పార్వతి స్పిన్నింగ్ మిల్లుల చెందిన 42 కోట్ల పైబడి విద్యుత్ బకాయి త్వరితగతిన వసూలుకు రెవిన్యూ రికవరీ యాక్ట్ కింద ఫారం ఇచ్చి విద్యుత్ బకాయి వసూలు చేసి జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలు ఒక నెల విద్యుత్ బకాయి చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తీసేస్తామని నానా హంగామా చేసే అధికారులు మాజీ ఎమ్మెల్యే మద్దాలగిరి చెందిన స్పిన్నింగ్ మిల్లులకు ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయికి కారకులైన అప్పటి విద్యుత్ అధికారులను విధుల నుంచి వెంటనే తొలగించి, విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మద్దాలగిరి తన ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలో శ్రీ వెంకటశివ పార్వతి స్పిన్నింగ్ మిల్లు అడ్డుపెట్టుకొని కొన్ని వందల కోట్ల రూపాయల రుణమాఫీ లబ్ధి చేకూర్చుకొని విద్యుత్ బకాయి చెల్లించలేదుని ఫారం A,ఫారం B, ఇచ్చినప్పటికీ ఎటువంటి సమాధానం లేదని, రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఫారం C తక్షణమే అమలు చేసి ఆస్తులను స్వాధీన పరచుకొని విద్యుత్ బకాయి జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వసనియ సమాచారం ప్రకారం తమిళనాడు కోయంబత్తూర్ లోని కొన్ని వందల కోట్ల విలువ చేసే రిసార్ట్, మేడికొండూరు మండలం పాలడుగు గ్రామం వద్ద 25 ఎకరాల భూమి, శ్యామల నగర్ లోని 100 కోట్ల విలువచేసే భవనం తన ఆస్తులను బినామీలపై ఆస్తులను బదలాయించడం జరిగిందని పేర్కొన్నారు. వెంటనే ఈ ఆస్తులపై ఎటువంటి లావాదేవీలు , పేరు మార్పులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగలక్ష్మి రెవెన్యూ అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా ఇన్సూరెన్స్ కల్పించాలి




**గుంటూరు, మేజర్ న్యూస్:** జిల్లాలో పంటలు సాగు చేస్తున్న రైతులందరిని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంటల ఇన్సురెన్స్ చేయటానికి వ్యవసాయ , ఉద్యాన శాఖ అధికారులు బ్యాంకర్లు, క్షేత్రస్థాయి ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ తో కలసి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, కౌలు రైతులకు పంటల రుణాల మంజూరుపై బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో మిర్చి, వరి తదితర పంటలు సాగుచేస్తున్న 3,48,933 మంది రైతులకు బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. వీరిలో మిర్చి సాగు చేస్తున్న రైతుల వివరాలను జూలై 31 వ తేది లోపు, వరి సాగు చేస్తున్న రైతుల వివరాలను అగష్టు 15 వ తేది నాటికి బ్యాంకర్లు ఇన్స రెన్స్ పోర్టల్ లో అప్ లోడ్ చేయాలన్నారు. పంటల బీమా పథకంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా రైతు సేవా కేంద్రాల ద్వారా బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. పంటల బీమా పథకంకు మరింత మంది రైతులను నమోదు చేయటానికి వీలుగా ప్రస్తుతం ఉన్న గడువును పొడిగించేలా వ్యవసాయశాఖ అధికారులు ఇన్స రెన్స్ కంపెనీల ద్వారా ప్రతిపాదనలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సీసీఆర్సీ కార్డులు జారీ చేసిన కౌలు రైతులందరికీ పంట రుణాలు మంజూరు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతు రుణాలకు నిర్దేశించిల లక్ష్యాల మేరకు నూరు శాతం పంట రుణాలు అందించేలా వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లుతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, ఉద్యానశాఖ అధికారి రవీందర్, బ్యాంకర్లు , ఇన్సురెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంధాయ పరిషత్ డైరెక్టర్గా పద్మజ

**గుంటూరు, మేజర్ న్యూస్ :**



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్గా గుంటూరు నలంద నగర్ కు చెందిన మగతాల పద్మజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన పద్మజ...జయహో నవ్యాంధ్ర పుస్తకాన్ని రచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములుగా చేస్తేనే అభివృద్ధి క్షేత్రస్థాయిలో అందుబాటులోకి చేరుతుందని ఆమె అన్నారు. ఈ పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెండేళ్ల క్రితం ఆవిష్కరించారు. పద్మజ నరసరావుపేటలో విద్యా వికాస్ పేరుతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గ్రంథాలయాల ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలను భాగస్వాములు చేయవచ్చని చెప్పారు. తనుకు డైరెక్టర్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు మాధవి, గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పద్మజా తండ్రి విశ్రాంత తాసిల్దారు లక్ష్మయ్య.

# పాల ఉత్పత్తిదారులకు బోనస్ లు అందజేసిన సంగం డైరీ

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలోని సంగం డైరీ పాల కేంద్రంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బోనస్ లు అందజేసే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాల ఉత్పత్తిదారుల నుండి పాల కొనుగోళ్ల ఆధారంగా ఈ బోనస్ను అందజేశారు. సంఘం డైరీ అధికారులు పాల ఉత్పత్తిదారులు తమ బోనస్ వివరాలను తెలుసుకోవడానికి మరియు స్వీకరించడానికి స్థానిక పాల కేంద్రం అధికారులను సంప్రదించాలని కోరారు. రైతులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి మరియు సంగం డైరీ ద్వారా వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఈ బోనస్ల పంపిణీ కార్యక్రమం ఉద్దేశించబడిందని సంఘం డైరీ అధికారులు వెల్లడించారు. సంగం డైరీ పాల కేంద్రం నందు 2024 - 2025 సంవత్సరానికి గాను బోనస్ల రుసుము మొత్తం 1,03, 13,668/- ప్రతి పాల ఉత్పత్తిదారునికి నాలుగు శాతం బోనస్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల సంఘం డైరీ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, మేనేజర్ డా. శివ రామకృష్ణ, డా. రవితేజ ,సూపర్వైజర్ శివరామయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



# జాతీయ క్లీన్ ఎయిర్. ను. గుంటూరులో పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ ఆదేశం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గాలి నాణ్యతను మరింతగా పెంపొందించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు సంబంధిత శాఖలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులతో కలసి గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు నగరాన్ని 2011 నుండి 2015 మధ్య గాలి నాణ్యత డేటా ఆధారంగా నాన్-అటైన్‌మెంట్ నగరాల్లో ఒకటిగా గుర్తించి, గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ ప్రొగ్రాంను రూపొందించటం జరిగిందన్నారు. రానున్న 10 సంవత్సరాల్లో గాలిలో కాలుష్యాన్ని 70 నుంచి 80 శాతం వరకు తగ్గించే లక్ష్యంతో నాన్-అటైన్‌మెంట్ నగరాల్లో కాలుష్యాన్ని తగ్గించి పచ్చదనం పెంచే కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా 2019-20 నుంచి 2024-25 వరకు గుంటూరు నగరానికి మొత్తంగా ఎన్సీఏపీ కింద రూ. 20.51 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం 2024%-%25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ రూ. 2.73 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరంలో గాలి నాణ్యతను పెంపోదించేందుకు సంపూర్ణ కార్యాచరణ ప్రణాళిక లో పేర్కొన్న చర్యలపై



సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ కాలుష్యనియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జ్ కూల్చివేసి నూతన బ్రిడ్జ్ నిర్మిస్తున్న నేపథ్యంలో జీజీహెచ్ వద్ద, ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న నేషనల్ ఎయిర్ మానిటరింగ్ పోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన స్టేషన్లును ప్రత్యమ్నాయ ప్రాంతాలకు మార్చాలన్నారు. జిల్లాలో తెనాలి, పొన్నూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ, పశువుల వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్ ఏర్పాటుకు నెడ్ క్యాప్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాల్మెంట్ ఇంజనీరు ఎండీ నజీనా బేగం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (ఇన్చార్జి) చంద్రముని, నగరపాలక సంస్థ ఈఈ సుందరరామిరెడ్డి, ఎంవీఐ మల్లేశ్వరి, ఏపీఎస్ఆర్టీసీ కమర్షియల్ మేనేజరు ఆర్ వీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని పర్యావరణ రహిత నగరంగా మారుద్దాం

## కార్పొరేషన్ మేయర్, కమిషనర్ వెల్లడి

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆగస్ట్ 1 నుండి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేదం అమలుపై చాంబర్ ఆఫ్ కామర్స్, హొటల్స్, రెస్టారెంట్ల యజమానులు, కర్రీ పాయింట్స్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం వలన, వాటిని తినే ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాదులు సోకుతున్నాయని పలు నివేదికల్లో వస్తున్నందున గుంటూరు నగరంలో హొటల్స్, కర్రీ పాయింట్స్ నిర్వహకులు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ ప్యాకింగ్ సంచుల వినియోగం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు కూడా నగరంలో ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి విచ్చలవిడిగా, అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న ఆహార విక్రయ బండ్లపై వినియోగించే నూనె, ఇతర పదార్థాలను తనిఖీ చేయాలన్నారు. వారు కూడా యధేచ్చగా ప్లాస్టిక్ సంచుల వినియోగం చేస్తున్నారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెలలో స్టేక్ హొల్డర్స్, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఏప్రిల్ 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలు చేస్తామని తెలియచేయగా, 3 నెలలు గడువు అడిగారన్నారు. అలాగే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అక్టోబర్ 2 నాటికి ప్లాస్టిక్ రహితంగా నగరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారని,అ అందుకు తగిన విధంగా గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేదించిన నగరంగా



తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ సూపర్ లీగ్ సిటిల్లో జాతీయ స్థాయిలో గుంటూరు నిలిచిందని, అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రతి నెల చేపట్టే ఐవిఆర్ఎస్ సర్వేలో కూడా శానిటేషన్ విభాగంలో తొలి స్థానంలో నిలిచామని, ఆ స్థానాలు నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై ఇంటింటి అవగాహన కల్గిస్తామని, ప్రత్యేకంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గూర్చి కరపత్రాలు, స్టిక్కర్లు అందిస్తామన్నారు. ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలులో ఉన్నందున క్యారీ బ్యాగ్స్ ఇవ్వబడవు అని బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతిమంగా నగరంలో ప్రజారోగ్యానికి, డ్రైన్లలో మురుగుపారుదలకు, పర్యావరణంకు హానీ కల్గిస్తున్న ప్లాస్టిక్ ని సమూలంగా నిషేదించాలని పిలుపునిచ్చారు.

అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలు చేస్తామని, చుట్టుపక్కల ప్రజలు, మిత్రులకు అవగాహన కల్గిస్తామని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

# చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం..!

- **ఆగస్టు 7 నుంచి అమలు చేసేందుకు నిర్ణయం**
- **చేనేత కుటుంబాల్లో హర్షం**
- **పవర్ లోన్ యూనిటీ 500 యూనిట్ల విద్యుత్ ఉచిత..!**
- **చేనేత కార్మిక కుటుంబానికి 200 యూనిట్లు ఉచితం**
- **93 వేల కుటుంబాలకు లబ్ధి**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినందుకు నిర్ణయం తీసుకుంది..మరోసారి చేనేత కార్మికుల పక్షంగా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 7న జరగనున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని.. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇది కేవలం ఎన్నికల హామీ మాత్రమే కాకుండా.. చేనేత రంగాన్ని ఆదుకునే దిశగా తీసుకున్న గొప్ప నిర్ణయంగా భావిస్తున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ పథకంతో ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. అంతేకాకుండా ప్రతి పవర్‌లూమ్ యూనిట్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ ప్రతిపాదనలకు మార్చిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా ఆమోదం లభించింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా 93,000 మందికి పైగా నేతన్నల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అలాగే 10,534 పవర్‌లూమ్ యూనిట్లు కూడా దీని వల్ల ప్రత్యక్షంగా లబ్ధిపొందుతాయి.



**"వచ్చేస్తున్న 'ఎవర్సెండై'.. ఏపీకి మలేషియా బడా కంపెనీ "**

ఇది రాష్ట్రంలోని చేనేత రంగానికి మరింత ఊతం అందిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం సుమారు రూ.120 కోట్ల వరకూ ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి చేనేతలకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో సంప్రదాయ వృత్తులు ముఖ్యంగా చేనేత రంగం కష్టాల్లో పడుతుంది. ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ఆదాయం తగ్గిపోవడం, మార్కెటింగ్ లోపం, ఆధునిక రంగాల పోటీ వల్ల నేతన్నలు వృత్తిని వదిలేసే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో వారికి ఉచిత విద్యుత్ పథకం ఆసరాగా నిలుస్తుందని భావిస్తున్నారు. కాగా పథకం అమలుకు సంబంధించి అధికారిక ఆదేశాలు ఇంకా రావాల్సి ఉంది.

# రాష్ట్ర గ్రంధాయ పరిషత్ డైరెక్టర్ గా పద్మజ



**గుంటూరు ,మేజర్ న్యూస్ :** రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ గా గుంటూరు నలంద నగర్ కు చెందిన మగతాల పద్మజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన పద్మజ జయహెూ నవ్యాంధ్ర పుస్తకాన్ని ఆమె రచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములుగా చేస్తేనే అభివృద్ధి క్షేత్రస్థాయిలో అందుబాటులోకి చేరుతుందని ఆమె అన్నారు. ఈ పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెండేళ్ల క్రితం ఆవిష్కరించారు. పద్మజ 23 నుంచి నరసరావుపేటలో విద్యా వికాస్ అని పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గ్రంథాలయాల ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలను భాగస్వాములు చేయవచ్చని చెప్పారు. తనుకు డైరెక్టర్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు మాధవి, గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పద్మజా తండ్రి విశ్రాంత తాసిల్దారు లక్ష్మయ్య.

# చేయిచేయి కలుపుదాం.. చేయూతనిద్దాం

- **బంగారు కుటుంబాల జీవితాలను మారుద్దాం**
- **మార్గదర్శకులుగా మారి పేదలను ఆదుకుందాం**
- **వివిధ అసోసియేషన్లతో ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సమాజంలో మానవ సంబంధాలను మెరుగుపరిచి, ఆర్థిక అంతరాలను దూరం చేసే మహత్తర కార్యక్రమం పీ-4 అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్స్, పెట్రోల్ బంకు యజమానులు, హొటల్స్ యజమానుల అసోసియేషన్లతో మంళవారం విడివిడిగా పీ-4పై సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మంగా రూపకల్పన చేసిన పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని తెలిపారు. మానవత్వాన్ని మేల్కొలుపుతూ పేద వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమం గేమ్ ఛేంజర్ అని చెప్పారు. ప్రతి ఒక్కరూ మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా మాత్రమే కాకుండా నైతికంగా మద్దతు ఇవ్వాలని చెప్పారు. విద్య, వైద్య పరంగా అండగా నిలవడం ద్వారా బంగారు కుటుంబాలను మెరుగైన స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 25 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని, అందరి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు.

# టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

## సమీక్షా సమావేశంలో కమిషనర్ అధికారులకు సూచన

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం టిడ్కో అధికారులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడు, వెంగళాయపాలెంలోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి జిఎంసి, టిడ్కో అధికారులతో కలిసి పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ ఇతర వేదికల ద్వారా టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రజల నుండి పలు అర్జీలు అందుతున్నాయని, వాటిని టిడ్కో, జిఎంసి అధికారులు సమన్వయంతో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం నగర పరిధిలో కేటగిరిలు వారిగా టిడ్కో ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి, ఎంత మంది నివాసం ఉంటున్నారు, ప్రధాన సమస్యలపై టిడ్కో అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. పర్యటనలో టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, ఉపా సెల్ పిఓ జె.రామారావు, టిడ్కో డిఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఏఈ వేణు పాల్గొన్నారు.